క్లుప్తంగా

పశుపతి నాథా.. చల్లంగ చూడయ్యా

సంబేపల్లె : పశుపతి నాథా.. చల్లంగా చూడయ్యా అంటూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ పశుపతినాథ ఆలయంలో సోమవారం భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు ఆధ్వర్యంలో హరికథ రమేశ్, వారి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనలతో భక్తులను అలరింపచేశాయి. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మానవహక్కులపై అవగాహన


మాట్లాడుతున్న తహసీల్దార్ అమరేశ్వరి

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీలోని గాంధీనగర్ ఎస్టీ కాలనీలో మానవహక్కులపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అమరేశ్వరి మాట్లాడుతూ ఎస్టీల హక్కులు, చట్టాలు గురించి తెలుసుకోవాలని సూచించారు. కాలనీలో ప్రధాన సమస్యలుంటే సభ దృష్టికి తీసురాకువాలని కోరారు. తమ కాలనీలో పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను జంబ్లింగ్ పేరుతో కొత్తపల్లి పాఠశాలకు మార్చారని, దీంతో ఒకటిన్నర కిలోమీటర్ పిల్లలు నడిచి బడికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని, ఐదో తరగతి వరకు ఇక్కడే పాఠశాలను కొనసాగించాలని కోరారు. ఎంఈఓతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాముడు, వీఆర్ఓ చాన్ బాషా, ఆర్ఐ రామ్మోహన్, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్టీ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి

పెనగలూరు: పోస్టల్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెనగలూరు తపాలా కార్యాలయం ఎస్‌పీఎంగా సుబ్బరాయుడు కోరారు. సోమవారం పెనగలూరు తపాలా కార్యాలయం ఎస్‌పీఎంగా సుబ్బరాయుడు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌పీఎం నాయక్ కడపకు బదిలీ అయ్యారు. టంగుటూరు పోస్టాఫీసు ఎస్‌పీఎంగా పనిచేస్తున్న సుబ్బరాయుడు పెనగలూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

పరామర్శ

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని అనంతరాజుపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ వ్యవసాయ జిల్లా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి కుటుంబసభ్యులను సోమవారం టీడీపీ నాయకుడు ముక్కా రూపానందరెడ్డి పరామర్శించారు. పంజం సుకుమార్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన అనంతరాజుపేటకు వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చి, సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధరలేక.. దిక్కుతోచక

- మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- కాయలు చేతికి వచ్చినా కొనేనాథుడే లేడు
- రోడ్డు పక్కన మామిడి కాయలను పడేస్తున్న వైనం
- కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలని రైతుల డిమాండ్


గిట్టుబాటు ధర లేకపోవడంతో మామిడికాయలను పారబోసిన రైతులు

సుండుపల్లె : సుండుపల్లె మండలంలో మామిడిని రైతులు అత్యధికంగా సాగు చేశారు. ఈ ఏడాది మామిడికి గిట్టుబాటు ధర లేక రైతన్నలు అల్లాడిపోతున్నారు. మామిడి చెట్లను నాటి వాటిని అపురూపంగా పెంచుకున్నారు. ఎండకు ఎండిపోకుండా లక్షల రూపాయలను ఖర్చు పెట్టి బోర్లను వేసి చెట్లకు నీరు అందిస్తూ వాటి ఎదుగుదల కోసం సేంద్రియ ఎరువులను కూడా వాడారు. చెట్టుకు చీడ పీడ పడకుండా మందులను పిచికారీ చేస్తూ కాపాడుకుని వస్తున్నా, తీరా మామిడి చేతికందాక గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎన్నో ఆశలతో ఈసారైనా మామిడి పంట దిగుబడి బాగా వస్తే అప్పుల బాధలు తీరుతాయని మామిడి రైతులు ఎంతో ఎదురుచూసినా.. ధర లేకపోవడంతో మామిడి రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు.

8,100 ఎకరాలలో మామిడిసాగు

మండల వ్యాప్తంగా 8,100 ఎకరాలలో రైతులు మామిడి పంటను సాగు చేస్తున్నారు. ఇందులో కొన్ని గ్రామాల్లో పంట అంతంత మాత్రమే పండింది. కొన్ని గ్రామాల్లో మామిడి పంట అధికంగా పండినప్పటికీ సరైన ధర లేక కోసిన కూలీలు, మండీలకు తీసుకెళ్లేందుకు బాడుగలు కూడా రాకపోవడంతో రైతులు పంటను కోయకుండా అలానే వదిలేశారు.

దళారీ వ్యవస్థతో మామిడి రైతుల కుదేలు

ఏడాది కాలం కష్టపడి పండించిన పంటకు మామిడికాయలు సరైన సైజు లేదని, కాయలు సరిగా లేవని రేట్లు తగ్గించి దళారులు రైతులకు తమ చేతివాటం చూపిస్తూ సరైన ధర ఇవ్వకుండా రైతులను దోపిడీ చేస్తున్నారు. రైతు మామిడి కాయలు కోసి మండీ దగ్గరికి తీసుకెళ్లినప్పుడు కాయలకు నల్ల బంక ఉందని ఈ కాయలు సరిగా లేవని మేము తీసుకోమని చెప్పి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా తక్కువ ధరలు ఇస్తూ దళారులు లాభాలు పొందుతున్నారు.


మామిడి తోటల్లోనే కాయలను వదిలేసిన రైతులు

గత ప్రభుత్వంలో మామిడికాయల రేటు

గత ప్రభుత్వంలో మామిడికాయలకు మంచి గిట్టుబాటు ధర ఉండేదని ఈ ఏడాది లాగా ఎప్పుడూ ఇంత తక్కువ ధరలకు అమ్మలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో గత సంవత్సరంలో మామిడి బేనీషా రకం కనిష్ఠంగా టన్ను రూ.40 వేల నుంచి గరిష్ఠంగా రూ.60 వేలు, నీలం రకం రూ.35 వేలు, తోతాపురి(బెంగళూర) రకం రూ.30 వేల వరకు అమ్మామని ఈ ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చాక బేనీషా రకం టన్ను రూ.16 వేల నుంచి గరిష్ఠంగా రూ.25 వేలు, నీలం రకం రూ.15 వేలు, తోతాపూరి (బెంగళూర) రకం రూ.4 వేలు రేటు ఉన్నట్లు రైతులు తెలిపారు.

ధర పడిపోయింది


ప్రతి ఏడాది కాస్త మెరుగైన రేట్లు ఉండేవి. కానీ ఈ ఏడాది మామిడికాయల ధర విపరీతంగా పడిపోయింది. రేటు వస్తుందని చెట్టుకు కాయలు అలానే పెట్టి ఎదురుచూసినా ఫలితం లేదు. ఆ రేటు వచ్చేలోగా మామిడికాయలు కింద రాలి పురుగులు పడి చెడిపోతున్నాయి. లక్షలాది రూపాయల నష్టం వచ్చి రైతులు నష్టపోతున్నారు.

– సుబ్బరామరాజు, వైఎస్ఆర్‌సీపీ మండల రైతు విభాగం ప్రెసిడెంట్, సుండుపల్లె

తోతాపురికి ప్రోత్సాహకం ఇవ్వాలి


తోతాపురి మామిడికాయలకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.4లు చెల్లించడానికి ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. కొనుగోలుదారులు రాకపోవడంతో మామిడికాయలు ఎండిపోయి రాలిపోతున్నాయి. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా మామిడి పంటకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు, పత్తివాండ్లపల్లె

4 ఎకరాలలో సాగు చేశా


నేను 4 ఎకరాలలో మామిడి పంటను సాగు చేశా. ఏడాదంతా దుక్కులు దున్నించి, ఎరువులను వేసి, చీడ పట్టకుండా మందులను పిచికారీ చేసి కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టం వచ్చింది.

– బండి నాగేశ్వర, రైతు, రాచంవాండ్లపల్లె, సుండుపల్లె

గిట్టుబాటు ధర లేదు


నేను 3 ఎకరాలలో నీలం రకం మామిడి పంటను సాగు చేస్తున్నాను. ఏడాదంతా కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకుండా పోయింది. గతంలో టన్ను రూ.30 వేలు ఉండేది. ఇప్పుడు రూ.10 వేల నుంచి రూ.15 వేలు అంటున్నారు. కనీసం మామిడిని కోసిన కూలీలు కూడా రావడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– నల్లపురెడ్డి కొండారెడ్డి, రైతు, మల్లక్కగారిపల్లె, సుండుపల్లె

ఆత్మీయ పలకరింపు


కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : మండలంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సోమవారం నీలకంఠ్రావుపేట ప్రజలు, రైతులతో శ్రీకాంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ప్రజలను పేరు పేరునా ఆత్మీయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మహిళలు, ప్రజల దృష్టికి తీసుకురావడంతో సొంత డబ్బులతో బోరు వేయిస్తానని శ్రీకాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఖాజాహుస్సేన్ అనారోగ్యంతో బాధపడుతున్న అబ్దుల్‌హుస్సేన్, మెకానిక్ దర్బార్‌లను శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

పెనగలూరు: మండలంలో సర్పంచ్‌లు నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ అజయ్‌రెడ్డి సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లతో విజయ్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే నిధులు కేటాయించి నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

ఓబులవారిపల్లె: కొర్లకుంట పంచాయతీలో పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని సోమవారం తహసీల్దార్ యామిని రెడ్డికి సీపీఐ మండల నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ మాట్లాడుతూ పంచాయతీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేదలు జీవిస్తున్నారని, వారికి కొర్లకుంట పంచాయతీ రెవెన్యూ సర్వే నంబరు 249/1లో 172 ఎకరాల భూమి ఉందని, సర్వే నిర్వహించి అర్హులైన పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి శివయ్య, మండల కార్యవర్గ సభ్యులు వెంకటరెడ్డి, నరసమ్మ, గ్రామస్తులు రాజేశ్వరమ్మ, వాణి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ దేవత ఆలయంలో సోమవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ. 6లక్షల, 51వేల, 300లు హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు తెలిపారు. అలాగే 11 గ్రాముల బంగారు వచ్చినట్లు పేర్కొన్నారు. నగదును ఆలయం ఖాతాకు జమ చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పూజారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలు గుర్తింపు

పుల్లంపేట: రాజంపేట ఎక్సైజ్‌శాఖ పరిధిలోని పుల్లంపేట మండలం, వత్తలూరు వడ్డిపల్లి, రాజంపేట మండలంలోని రోళ్లమడుగు గ్రామాలను సారా రహిత గ్రామాలుగా గుర్తించినట్లు ఎక్సైజ్ శాఖ సిఐ మల్లిక తెలిపారు. సోమవారం ఈ రెండు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.

ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి


రెడ్డెప్ప రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సిద్ధవటం: ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి అని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన సిద్ధవటంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ అమీర్‌ఖాన్, భాకరాపేట జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంటు మాదిరెడ్డి వీరనాగిరెడ్డి, మాధవరం–1 గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరపురం జెడ్పీ హైస్కూల్ సైన్స్ అసిస్టెంటు సీ.వి. సుధాకర్ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన వారిని సత్కరించి బహుమతులను అందజేశారు. పలువురు రిటైర్డ్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

సంబేపల్లె : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది అని నోబుల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన రెడ్డెప్పరెడ్డిని సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండలంలోని సింగారెడ్డిపల్లి పోస్టాఫీసులో పనిచేస్తున్న ఏబీపీఎం కేవీ రమణరావు సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను పోస్టల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. మన్నూరు ఎస్‌పీఎం సిద్ధవరం హరికృష్ణ, మెయిల్ వర్కర్ సుబ్రమణ్యం, పెనగూరు ఎస్‌పీఎం సుబ్బరాయుడు, పోస్టల్ సిబ్బంది హరి, అనీల్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడికి పదవీ విరమణ సహజమని మండల రెండవ విద్యాశాఖ అధికారి ధర్మవరం ప్రభాకర్, సాలాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పందేటి లోకేశ్వరరాజు అన్నారు. ఒంటిమిట్ట మండలంలో సోమవారం మండల రెండవ విద్యాశాఖ అధికారి సాలాబాద్ యూపీ పాఠశాల హెచ్‌ఎం పందేటి లోకేశ్వర రాజు పదవీ విరమణ పొందారు. వీరికి మండల విద్యాశాఖ కార్యాలయంలో.. సాలాబాదు ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది వేర్వేరుగా సన్మానించారు.ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, సాలాబాదు యూపీఎస్ ఉపాధ్యాయులు సురేష్ కుమార్, మూర్తి, అమర్నాథ్, మస్తాన్ బాబు, రాజేంద్ర, శ్రీనివాసరెడ్డి, నరసారెడ్డి, రఘునాథరాజు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ప్రధానోపాధ్యాయుడు గంగిరెడ్డి పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి మండలం, దేవలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు టీచర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన నగిరి చలపతి నాయుడును ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, బంధువులు పాల్గొన్నారు.

నిజనిర్ధారణ కమిటీ సభ్యులపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి టౌన్ : తన కుమార్తె సృజన మృతి విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్న నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, నాగమునిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు సోమవారం మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సృజన తండ్రి ఉత్తయ్య మాట్లాడుతూ ఇటీవల తన కుమార్తె సృజన ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొందని తెలిపారు. ఆమె ఆత్మహత్యకు తారకరత్నం అనే యువకుడు కారణమని చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు కూడా కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ నెల 18వ నిజనిర్ధారణ కమిటీ పేరుతో ఈశ్వరయ్య, దేవపట్ల నాగముని తమ కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పి వెళ్లారని, అయితే నాలుగు రోజుల తరువాత తన కుమార్తె వ్యక్తిత్వం మంచిది కాదని, కుటుంబ కలహాల కారణంగానే చనిపోయిందని, తారకరత్నానికి ఎలాంటి సంబంధం లేదని దినపత్రికలలో, వాట్సాప్ గ్రూప్‌లలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని వాపోయారు. తప్పుడు ప్రచారం చేస్తున్న ఈశ్వరయ్య, నాగమునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

ఆలయానికి స్థలాన్ని కేటాయించాలి

రాయచోటి : పాలేటి గంగమ్మ ఆలయం సమీపంలోని ప్రభుత్వ భూమిని ఆలయానికి కేటాయించాలని ఇందిరమ్మ కాలనీ వాసులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. మదనపల్లి రూరల్ మండలం, కోళ్లబైలు గ్రామం, ఇందిరమ్మ కాలనీలోని పాలేటి గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం రాయచోటిలోని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిప్రతం ఇచ్చారు. గంగమ్మ గుడి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించామని, ఆ ప్రాంతాన్ని ఆలయానికి కేటాయించేలా రెవెన్యూ అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట స్థల కేటాయింపు కోరుతూ ప్రదర్శన చేశారు.

ప్లీనరీని జయప్రదం చేయండి

రాయచోటి టౌన్ : ఆర్‌ఎస్‌ఎఫ్ రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం) ఆధ్వర్యంలో ఆగస్టు 23, 24వ తేదీలలో కడపలో రాష్ట్రస్థాయి ప్లీనరీ నిర్వహిస్తామని, సమావేశాలను జయప్రదం చేయాలని ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. రాయచోటి పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజుల పేరుతో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలు విద్యార్థులను దోపిడి చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

పుల్లంపేట: మండల పరిధిలోని ఎగువరెడ్డిపల్లి ఏడ్ల్యూ పాఠశాలకు కుప్పాల రామకృష్ణయ్య విశ్రాంత ఉపాధ్యాయులు సోమవారం కంప్యూటర్ వితరణ చేశారు. మండల విద్యాశాఖాధికారులు చక్రాధర్ రాజు, నాగ తిరుమలరావు చేతులు మీదుగా డెస్క్‌టాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమా మహేశ్వర్, ప్రధానోపాధ్యాయులు కుప్పాల రామకృష్ణయ్య, శివ, చంద్రశేఖర్ నాయుడు, సీఆర్‌ఎంటీ ఆనంద్, ఎస్ఎంసీ చైర్మన్ రెడ్డి పాకు సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం హసనాపురం పంచాయతీ వడ్డెపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాయచోటి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి ఆర్థికసహాయంతో సోమవారం నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, రబ్బర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు అభ్యసన సామగ్రి పంపిణీ చేయడం సంతోషాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు కష్టపడి చదవి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంగల్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఇందాద్‌అహమ్మద్, ఆవటాల వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రాయచోటి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని సోమవారం పి.సురేష్‌కుమార్ ఆర్థిక సహాయంతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాయచోటి రోటరీ క్లబ్ అధ్యక్షుడు మనోజ్ కుమార్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు అందచేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవి ఉన్నత శిఖాలను చేరాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శశిశుఖర్, మహేశ్వర రాజు, హుసేన్, నరసింహ, రూపేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేస్తున్న దాతలు


విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఘర్షణ కేసులో ఇద్దరికి రెండేళ్లు జైలు

కడప అర్బన్ : ఘర్షణ కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష విధించారు. కడప చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిద్దయ్య అతని తమ్ముడు షబ్బీర్‌లకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధించారు. కడప సింహపురి కాలనీలో నివాసం వున్న పావని , రంగనాథ్ దంపతులకు సిద్దయ్య, షబ్బీర్ లకు ఇంటి స్థలం విషయంలో ఘర్షణ తలెత్తింది. 2022 మే 26న సిద్దయ్య, షబ్బీర్ ఇద్దరూ ఆ దంపతులపై దాడి చేశారు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఆ ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ రెండవ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు.

డ్రోన్ మంజూరు

సుండుపల్లె : రైతుకు కోసం రాయితీతో డ్రోన్ పరికరాన్ని మంజూరు చేసినట్లు జేడీ శివనారాయణ తెలిపారు. సుండుపల్లె -3 సచివాలయంలో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

కనిపించే దేవుడు వైద్యుడు

- నేడు వైద్యుల దినోత్సవం



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యమే మహాభాగ్యమంటారు. మనిషికి ఎంత సంపద ఉన్నా దాన్ని అనుభవించే ఆరోగ్యం లేకపోతే అదంతా వృథాయే. అనారోగ్యంతో బాధపడే వారిని ప్రమాద స్థితి నుంచి కాపాడే శక్తి కేవలం వైద్యుడికే ఉంది. సమాజంలో అత్యంత పవిత్రమైన, కీలకమైన వృత్తి వైద్యం. సాక్షాత్తు దేవుడులాంటివాడివంటూ హృదయపూర్వకంగా నమస్కారం చేస్తారు. అందుకే ఆయనను 'వైద్యో నారాయణో హరి' అంటూ గౌరవిస్తారు. భారతరత్న డాక్టర్ బీసీ రాయ్ వైద్య రంగం అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన వైద్య కల్పనకు విశేషమైన కృషి చేశారు. ఆయన సంస్మరణార్థం ప్రతి ఏటా ప్రభుత్వం జూలై 1వ తేదీన నేషనల్ డాక్టర్స్ డేను నిర్వహిస్తున్నారు. వైద్యులు ఆ మహనీయుడి స్ఫూర్తితో వైద్య రంగంలో రాణిస్తున్నారు. వైద్యులకు సంబంధించి వైఎస్సార్ కడప జిల్లాలో కొన్ని విశేషాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కడప నగరం వీధివీధే డాక్టర్‌తో నిండి ఉంది. దాదాపు వంద మీటర్ల పొడవునా ఇరువైపుల ఆ వీధంతా డాక్టర్లు, వైద్యశాలలు, ల్యాబొరేటరీలు, మందుల దుకాణాలు ఉన్నాయి. దాన్ని క్రిస్టియన్‌లేన్‌గా వ్యవహరిస్తున్నా నిజానికి దాన్ని డాక్టర్స్ వీధి అనాల్సి ఉంది. రేయింబవళ్లు ఈ వీధిలో రోగులను తరలించే అంబులెన్స్‌లు కనిపిస్తూనే ఉంటాయి. రోగులకు విశేష సేవలు అందిస్తున్న వైద్యులకు వైద్యుల దినోత్సవ సందర్భంగా పలువురు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.